క్లుప్తంగా

రహ'దారి'పై ధాన్యం..



నారాయణపురం వద్ద రహదారిపై..

అశ్వారావుపేటరూరల్: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంట కోతలు ఊపందుకున్నాయి. దీంతో చేతికందిన ధాన్యాన్ని రైతులు పొలాలు, పంట కల్లాల్లో ఆరబోస్తుంటారు. కానీ ఖాళీ స్థలాలు, పంట కల్లాలు లేక అశ్వారావుపేట మండలం నారాయణపురం వద్ద ప్రధాన రహదారికి ఓ వైపు ధాన్యం పోసి ఆరబెట్టారు. దీంతో దారిలో ఆరబోసిన ధాన్యం రాశులతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐదు రోజుల క్రితం ఇదే ధాన్యం కుప్పల కారణంగా ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోగా, ఈ ప్రమాదంలో తల్లీకొడుకు గాయాలయ్యాయి.

కార్తీక వనసమారాధన



వనసమారాధనలో కుర్చీల ఆట ఆడుతున్న విశ్వబ్రాహ్మణ మహిళలు, యువతులు

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామ శివారులోని పామాయిల్ క్షేత్రంలో విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వనసమారాధనకు విశ్వబ్రాహ్మణులు వందల సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరై, ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. మహిళలు, యువతులు వ్యవసాయ క్షేత్రంలో చెట్లకు పసుపు కుంకుమలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలు రకాల ఆటలు, పాటలు, వినోదం వంటి కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు. ఔత్సాహికులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. విశ్వబ్రాహ్మణులు అంతా ఒకే వేదికపై సహపంక్తిలో కూర్చుని, విందు భోజనాలను ఆరగించారు.

సమన్వయ లోపంతో నష్టం

దమ్మపేట: నాయకుల మధ్య సమన్వయంతో వ్యవహరించకుండా కుటిల రాజకీయాలు చేయడం వల్ల బీఆర్‌ఎస్‌కు తీరని నష్టం కలుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రం, దమ్మపేట శివారులోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే తాటి విలేకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తాటి మాట్లాడుతూ.. శనివారం మండలంలోని పార్కలగండిలో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన మండల సమావేశానికి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తనకు సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. పార్టీ సమావేశాలను ప్రజలకు తెలిసేలా బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలి కానీ రహస్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతంలో జరిగిన బీఆర్‌ఎస్ జిల్లా సమావేశాల్లో నియోజకవర్గ, మండల కమిటీలను రద్దు చేశామని ప్రకటించగా.. నేడు అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మెచ్చా వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేకు వినతి

మణుగూరురూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును హైదరాబాద్‌కు చెందిన ఓయు ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు వచ్చిన విద్యార్థుల సౌకర్యార్థం భవనాన్ని నిర్మించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెం అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గొరివేణి ప్రవీణ్, సోడే నవీన్‌కుమార్, నాయకులు కొమరం ప్రకాష్, వంశీ, గోపాల్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

అశ్వారావుపేటరూరల్: రోజు రోజుకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీ పెరుగుతోందని, తక్షణమే దీనిని అరికట్టి ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్ మండల కార్యదర్శి కుంజాజ అర్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని దురదపాడు గిరిజన గ్రామంలో కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై పీవైఎల్, పీఓడబ్ల్యూయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఉద్యమాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేసి, ఆస్పత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని కోరారు. నాయకులు కంగాల వెంకటేష్, కొమరం లక్ష్మణ్‌రావు, కుంజా లక్ష్మి, కొడిమి పార్వతి పాల్గొన్నారు.

సమస్యల వలలో ఆదివాసీలు

- వలసొచ్చినా తీరని వ్యథలు
- రోడ్లు ఉండవు.. కరెంట్ రాదు..
- సరిపడా నీళ్లుండవు..
- మాధన్నగూడెం వాసుల కష్టాల తీరిదీ..



సీసీ రోడ్డుకు నోచుకోని రహదారిని చూపుతున్న గ్రామస్తులు



తాగునీటి కోసం చేతిపంపు వద్ద గుమికూడిన గ్రామస్తులు

కరకగూడెం: తమ స్వగ్రామాల నుంచి కష్టాలను తప్పించుకుని కొత్త జీవితాన్ని ఆశించి వలస వచ్చినప్పటికీ ఆదివాసీలు మరో విధంగా కష్టాల గుట్టలో చిక్కుకుపోయారు. వారి గ్రామంలో కరెంటు వెలుగులుండవు.. ఎండాకాలంలో సూర్యుడు మండినా ఫ్యాన్‌కు దిక్కు ఉండదు. అత్యవసర సందర్భాలు వెంబడించిన రోడ్లు వసతులు లేవు. పిల్లలు చదువుకోవడానికి స్కూలుకు పంపాలన్నా, పోషకాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలన్నా ప్రయాణం చేయడం కత్తిమీద సాములాంటిది. కరకగూడెం మండలంలోని రేగళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మాధన్నగూడెం గ్రామంలోని ఆదివాసీల గాథ ఇది.

మాధన్నగూడెం గ్రామంలో మౌలిక వసతులు లేవు. ముఖ్యంగా కరెంటు లేకపోవడం వల్ల రాత్రుళ్లు చీకటిలో గడుపుతున్నారు. పిల్లలు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. వేసవి కాలంలో వేడిమి తట్టుకోలేక అల్లల్లాడుతున్నారు. ఇటీవల అధికారులు గ్రామంలో కరెంటు లైన్ ఏర్పాటు చేశారు. గ్రామస్తులు కరెంటు మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అవి కార్యరూపం దాల్చితే కరెంట్ కష్టాలు తీరుతాయి. మరోవైపు ఇక్కడ నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నప్పటికీ నూతనంగా పెరిగిన కుటుంబాలకు అనుగుణంగా పైపులైన్ వేసి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం సుమారు 44కుటుంబాలకు గ్రామంలో ఒకే ఒక చేతి పంపు ఉంది. అందరూ అక్కడ వరుసలో నిలబడి తమ వంతు వచ్చాక వచ్చి నీటిని తీసుకెళ్లాల్సిందే. ఇక గ్రామంలో సరైన రోడ్లు లేవు. దీంతో వర్షాకాలంలో వారి గ్రామాలు వాగుల వలె మారిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి చేరుకోవడం కష్టమవుతోంది. వీటికి తోడు సరైన విద్య, పోషణ లభించక భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తోంది.

పోడు భూముల సమస్య..

అడవులను ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీలు ప్రస్తుతం తీవ్రమైన భూమి సమస్యను ఎదుర్కొంటున్నారు. తమ పోడు భూములకు పట్టాలు లేకపోవడం వల్ల వారు నిరంతరం అనిశ్చితతలో కొట్టుమిట్టాడుతున్నారు. పోడు భూములు అంటే ఆదివాసీలు తమ జీవనోపాధి కోసం అడవుల్లో చిన్న చిన్న స్థలాలను ఎంచుకుని వ్యవసాయం చేసే భూములు. వీటిపై వారికి పట్టాలు లేకపోవడం వల్ల, అధికారులు వీటిని ఆక్రమణలుగా భావిస్తున్నారు. ఫలితంగా ఫారెస్ట్ అధికారులు తరచూ వారి భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇది వరకే ట్రెంచ్ కొట్టి ఈ భూములను రెండు సార్లు లాక్కున్నారు. దీంతో ఆదివాసీలు తమ జీవనోపాధిని కోల్పోతున్నారు. పోడు భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, వారికి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం, వారి సంస్కృతిని గౌరవించడం, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మిషన్ భగీరథ కనెక్షన్లు పెంచాలి



మా గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నూతనంగా ఏర్పాటు చేసిన ఇళ్లలకు ఇంకా కనెక్షన్ ఇవ్వలేదు. తద్వారా మాకు నీటి గోస తప్పడంలేదు. గ్రామంలో ఒకే మంచి నీటి పంపు ఉండడంతో అందరం అక్కడికి వెళ్లి నిరీక్షించి మా వంతు వచ్చాక నీటిని తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలి.

– పద్దం అరుణ, గ్రామస్తురాలు

ఇబ్బందులు తప్పడం లేదు



గ్రామంలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు మారుతున్నా.. నాయకులూ మారిన మా జీవితాల్లో ఏమాత్రం మార్పులు లేవు. సరైన రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మా గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేసి మా సమస్యను తీర్చాలి.

– మడివి దేవి, గ్రామస్తురాలు

పోడు భూములకు పట్టాలివ్వాలి



అడివిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మాకు పొట్టకూటికి నానా తిప్పలు తప్పడం లేదు. ప్రతి రోజు పనికెళ్తేగాని ముద్ద నోట్లోకి వెళ్లదు. మా జీవనోపాధికి మూలమైన పోడు భూములకు పట్టాలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి. ఉన్న కాస్త పోడుభూములను ఫారెస్ట్ అధికారులు లాక్కోకుండా పాలకులు చొరవచూపాలి.

– సోడి దేవయ్య, గ్రామస్తుడు

మమ్మల్ని పట్టించుకోండి



ఊరికి చివరిగా అటవీ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని చీకట్లో జీవనం సాగిస్తున్నాం. మమ్మల్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని సంక్షేమ పథకాలను అందజేయాలి. మా జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి మా వేదనలను తీర్చాలి. చదువుకుంటున్న విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. గ్రామంలో వసతులు కల్పించాలి.

– మడివి చందు, గ్రామస్తుడు

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



అన్నపురెడ్డిపల్లిలో వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని మల్కారం, రాచూరుపల్లి గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం 'హలో శుభోదయం'కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని వీధుల్లో పర్యటించారు. పిల్లలు, పెద్దలను పలకరించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వాటిల్లో సాధ్యమైన వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో సూచించారు. రాచూరుపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కొర్సా నాగరాజు అనే యువకుడికి గతంలో జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోగా, అతడికి నిమ్స్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే సహకారంతో కృత్రిమ కాలును ఏర్పాటు చేశారు. నాగరాజు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే.. ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో నాగరాజు తిరిగి క్రీడలు ఆడేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయండి

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాల్సిందిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. గురుకుల పాఠశాలలో నిర్వహించనున్న సైన్స్‌ఫేర్ కోసం ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఎగ్జిబిట్స్ ఏర్పాటు చేసే గదులను, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థుల బస చేసే గదులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సైన్స్‌ఫేర్ ప్రారంభోత్సవ కార్యాక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకట్, శ్రీకాంత్, వినోద్‌లతోపాటు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి వస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు, మిలిటెంట్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, ఉంజుపల్లి, కలివేరు క్రాస్‌రోడ్, తాలిపేరు ప్రాజెక్టు తదితర ప్రాంతాలలో మోహరించిన సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు.

దారి చూపాలని రైతుల ఆందోళన



నిరసన దీక్ష చేపడుతున్న ఆదివాసీ రైతులు

చండ్రుగొండ: పంటచేలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మద్దుకూరు గ్రామంలో ఆదివాసీ రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామంలోని రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచె వేసిన ఆదివాసీ రైతులు నిరసన దీక్ష చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మద్దుకూరు గ్రామానికి చెందిన 120 మంది ఆదివాసీలకు 2004 ఏడాది అప్పటి ప్రభుత్వం 150 ఎకరాల జంగిసిపాయి భూములను పంపిణీ చేసింది. ఆ భూములను 20 ఏళ్లుగా ఆదివాసీ రైతులు సేద్యం చేసుకుంటున్నారు. కాగా తాజాగా ఆ భూముల్లోకి వెళ్లకుండా గిరిజనేతర రైతులు ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై గిరిజనేతర రైతులకు విన్నవించిన ఫలితం లేదని చెప్తున్నారు. దారి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఆదివాసీలు మడివి రాఘవులు, కాక వెంకటేశ్వర్లు, పద్దం సూర్యం, తాటి నర్సింహారావు, చాపల దుర్గారావు, కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న అనుచరుడిని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన తుమ్మల అనుచరుడు దొడ్డా ప్రసాద్ అనారోగ్య కారణంగా చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల, శ్రీరాంపురం నివాసంలో దొడ్డా ప్రసాద్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చలసాని సాంబశివరావుతో పాటుగా స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం పూర్వ వైభవానికి కృషి చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

అశ్వాపురం: మండలంలో సీపీఎంకు పూర్వ వైభవం వచ్చేలా పార్టీ శ్రేణులు పోరాటాల ద్వారా కృషి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం సీపీఎం పార్టీ 9వ మండల మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కనకయ్య మాట్లాడుతూ పోరాటాల గడ్డ రామచంద్రాపురం అని ఈ ప్రాంతంలో అనేక పోరాటాలు చేసిన అనుభవం సీపీఎం కు ఉందని పోరాటాలు నిర్వహించి ఎంతో ప్రజాదరణ పొందిన సీపీఎంకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దేశాన్ని దోచుకున్నాయని పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవని, పరిశ్రమలు కార్పొరేట్ల జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. సీతారామ ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రారంభించారని కాలువలో నీళ్లు లేకుండా స్విచ్‌లు వేస్తే నీళ్లు వస్తాయా అని ప్రశ్నించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శిగా పాయం నర్సింహారావును 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు బ్రహ్మాచారి, గద్దల శ్రీనివాసరావు, పాయం నర్సింహారావు, స్వర్గం బాలనర్సయ్య, కొప్పుల పద్మ, నాగభూషణం, దండి రాములు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

- ఆదమరిస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ!
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



మణుగూరురూరల్: రోజు రోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. సామాజిక మాధ్యమాలు, బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేస్తున్నారు. ఫోన్ కాల్స్, మెసేజ్ లింకులతో సైబర్ నేరగాళ్లు మరో స్కెచ్‌కు తయారయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను క్యాష్ చేసుకునేందుకు, సర్వే పేరుతో అమాయక ప్రజల నెత్తిన టోపీ పెట్టేందుకు అవకాశం లేకపోలేదు. ఇప్పటికే సైబర్ క్రైమ్ అధికారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పలుమార్లు హెచ్చరికలు సైతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఇంటింటికి తిరిగి కుటుంబాల వివరాలను నమోదు చేసుకుంటోంది. ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు సమగ్ర సర్వే పేరుతో మొబైల్ నంబర్‌కు లింకులు పంపిస్తున్నారు. సర్వే పేరుతో వచ్చే లింకులను క్లిక్ చేస్తే.. ఇక మీ బ్యాంకు ఖాతా ఖాళీ అవ్వడం ఖాయమని సైబర్ సెక్యూరిటీ అధికారులు చెబుతున్నారు. ఎవరైనా కుటుంబ సర్వే పేరుతో ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలన్నా, మీ వ్యక్తిగత వివరాలు తెలపాలన్నా.. చెప్పొద్దని సూచిస్తున్నారు. సర్వే కోసం ఎవరైనా మీ ఇంటికి వచ్చినా కూడా వారికి ఓటీపీ లాంటివి చెప్పాల్సిన అవసరం లేదని, మీ వివరాలకు సంబంధించిన పత్రాలు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని తెలుపుతున్నారు. ఎవరైనా అలా చెప్పినా, పత్రాలను అడిగి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే మీ బ్యాంక్ ఖాతా ఖాళీ అవుతుందని హెచ్చరిస్తున్నారు.

అవగాహన అవసరం: పోలీసులు

రోజురోజుకూ సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఎంతోమంది మోసపోతున్నారని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. చదువుకున్న వారు సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడి నష్టపోతున్నారన్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తుండడంతో ప్రజలు తెలిసి తెలియక తమ ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి మోసానికి గురవుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు ఎవ్వరికి చెప్పొద్దని సూచించారు. ఎవరైనా మోసానికి గురైనా, అపరిచిత వ్యక్తులపై అనుమానం వచ్చినా వెంటనే పోలీసులను కానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రామాలయం నుంచి తలంబ్రాలు తీసుకొస్తున్న ఈఓ రమాదేవి, తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి అనుబంధ ఆలయమైన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామివారి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంను ఆలయ ఈఓ బి.రమాదేవి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో స్వామివారి రుద్రాభిషేకం తదితర పూజలకు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరనల నడుమ నూతన కల్యాణ మండపానికి స్వామివారిని, అమ్మవారిని ఊరేగింపుగా మేళతాలలతో తీసుకొచ్చారు. దేవస్థానం ఈఓ రమాదేవి దంపతులు స్వామివారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించగా, వేదపండితులు కల్యాణ తంతును నిర్వహించారు. శివయ్య కల్యాణం సందర్భంగా భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం అన్నప్రాసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యాలం బాబ్జి–సత్యకుమారి దంపతులు, యాలం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోటన్న ఆశయ సాధనకు పోరాడుదాం



సంతాప సభలో నివాళులర్పిస్తున్న నాయకులు

గుండాల: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మాజీ దళ కమాండర్ కోటన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, జిల్లా నాయకులు కోరం సీతారాములు పిలుపునిచ్చారు. మండలంలోని దేవళ్లగూడెం గ్రామంలో ఆదివారం కోటన్న సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోటన్న సమాజంలో మార్పు కోసం ఆదివాసీల హక్కుల కోసం పోరాడడని తెలిపారు. చిన్న వయస్సు నుంచే న్యూడెమోక్రసీ రాజకీయాలను అర్థం చేసుకుని ప్రతిఘటన పోరాటంలో దళంలో సభ్యుడిగా చేరాడడని గుర్తు చేశారు. ఆయన అకాల మరణాన్ని ఎవరూ ఊహించలేనిదని, కోటన్న ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పాలొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెండగంట్ల పెంటన్న, పాయం ఎల్లన్న, భానోత్ లాలు, మోకాళ్ల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యాసారపు వెంకన్న, ఈసం కృష్ణ, పూనేం పొట్టయ్య, వీరన్న బుచ్చయ్య, ఈసం సుధాకర్, పూనెం మల్లేష్, దుగ్గి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక'ంగా బోధన

- తిమ్మంపేట యూపీఎస్‌లో స్పెషల్ క్లాసులు
- ప్రతిరోజూ విద్యార్థులకు గంటపాటు అదనపు తరగతులు



విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ములకలపల్లి: ప్రభుత్వ పాఠశాల అంటే విద్యార్థులను నిర్ణీత వేళ కంటే ముందే వదిలేస్తారని, టీచర్లు వీలైనంత త్వరగా ఇళ్లకు వెళ్లేందుకు సన్నద్ధంగా ఉంటారనే అపోహ విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఐతే తిమ్మంపేట యూపీఎస్‌లో మాత్రం పాఠశాలలో మాత్రం ఇందుకు భిన్నంగా, స్కూల్ ముగిసిన తదుపరి మరో గంట అదనంగా బోధిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో (యూపీఎస్) 62 విద్యార్థులున్నారు. వీరిలో 42 మంది చిన్నారులు 3వ తరగతి నుండి ఏడో తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక తరగతులు బోధిస్తూ, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. పాఠశాల సమయం ముగిసిన అనంతరం సాయంత్రం 4.15 గంటల నుండి 5.15 వరకూ ఆవరణలో చిన్నారులను కూర్చుండబెట్టి పాఠ్యాంశాలు చదివేలా దృష్టి సారిస్తున్నారు. స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ, విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. గ్రామీణ వాతావరణం నేపథ్యంలో ఇళ్ల వద్ద తల్లిదండ్రులు పాఠ్యాంశాలు బోధించే అవకాశాలు తగ్గువగా ఉంటాయనే ఉద్దేశంలో ఉపాధ్యాయ బృందం ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించే ధోరణిలో ఏడో తరగతి వరకు చదువుతున్న చిన్నారులకు సైతం అదనపు తరగతులు బోధిస్తున్నారు. అక్షరదోషాలు లేకుండా రాసే చక్కటి చేతిరాత, చూసి చదవడం వంటి అంశాలను నేర్పుతున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపుతూ వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల సమయానికంటే కాస్త ముందుగానే ఇళ్లకు వెళ్లాలనుకునే పంతుళ్లున్న ఈ రోజుల్లో స్థానిక టీచర్ల పనితీరును పలువురు అభినందిస్తున్నారు.

ఉపయోగకరంగా ఉంది



అదనపు తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. మరో గంటపాటు చదువుకునే అవకాశం దక్కింది. ఏవైనా డౌట్స్ ఉన్నా, టీచర్లు అందుబాటులో ఉండడంతో, వెంటనే తెలుసుకునే వీలుకలుగుతోంది.

– జి.పవిత్ర, విద్యార్థిని, ఏడోతరగతి

ఉపాధ్యాయుల సహకారంతోనే..



వ్యవసాయాధారిత కుటుంబాలు కావడంతో చిన్నారులను ఇళ్ల వద్ద చదివించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అందువల్లే బడిలోనే మరో గంట అదనంగా ఉంచుతున్నాం. హోంవర్క్ చేయించడంతోపాటు రాయిస్తూ, చదివిస్తున్నాం. ఉపాధ్యాయ బృందం నిర్మల, సురేశ్, ప్రశాంత్, ముత్తేశ్వరరావు సహకారంతో విజయవంతంగా ముందుకు సాగుతున్నాం.

– బి.శంకర్, ప్రధానోపాధ్యాయుడు